# నామస్మరణకు మించిన సాధన లేదు

జపహోమనిత్యాగ్ని తపములు చేసిన
సరిరావు హరినామ స్మరణకన్న
తీర్థయాత్రలు కొన్ని తిరిగి సేవించిన
సరిరావు హరినామ స్మరణకన్న
ఉపవాసవ్రతములు విడువక చేసిన
సరిరావు హరినామ స్మరణకన్న
అశ్వమేధంబులు అమితంబుగా చేయ
సరిరావు హరినామ స్మరణకన్న
అడవిలోపల ఆకులలములు తినుచు
సంచరించిన ఫలమేమి సాధువయ్యి
ఎంచి చూడగ యివియన్ని యేమిఫలము
స్మరణ లేకున్న హరికరుణ కలుగబోదు
వేదవేదాంగములు వల్లెవేసియున్న
పద్యగద్యంబులను కూర్పకలిగియున్న
చిత్తశుద్ధియులేకున్న చెడునువాడు
సత్యమును తెలుపుబాట యీ సాయిమాట

ప్రేమస్వరూపులారా!

ఎంతటి తెలివితేటలుగలవాడైనను, యెంతటివిద్యావంతుడైనను, అంతఃకరణశుద్ధియే లేకుండిన ఆత్మానందమును అనుభవించలేడు. ధ్యాన, తప, యోగ, ధర్మ యిత్యాది సత్కర్మలాచరించి, ఫలాపేక్ష రహితమైన దాన ధర్మాదులను సల్పి, సామాజికమైన

srisathyasaivachanamrutam

కర్తవ్యకర్మలు నిర్వహించటమే చిత్తశుద్ధికి ప్రధానమైన మార్గము. ఆనందమన్నది మనము క్రొత్తగా సంపాదించుకొనేదికాదు. ఆనందము మానవుని స్వరూపము. తన స్వరూపమును తాను సందర్శించటమే మానవుని ప్రధానకర్తవ్యము. తెల్లవారి మొదలు రాత్రిపరుండునంతవరకు, పుట్టినదిమొదలు గిట్టునంతవరకు యీ ఆనందము నిమిత్తమై మానవుడు అనేక విధములుగా తాపత్రయ పడుతూ, అఱ్ఱులు చాచుతూ, అనేక విధములుగా దీనిని పొందుటకు ప్రయత్నించుచున్నాడు. యింద్రియ సంబంధమైన ఆనందముననుభవించుచు యిదియే నిత్యానందము, సత్యానందము అని భావించి కేవలము ప్రతిబింబానంద నిమిత్తమై తాను ప్రాకులాడుతున్నాడు. కానీ, యీ ప్రతిబింబానందము నిత్యానందముకానీ, ఆత్మానందముకానీ కానేరదు. అక్షయానందము, అద్వైతానందము, అతీతానందము అయినటువంటి బ్రహ్మానందమునే మానవుడు నిజముగా అనుభవించవలసినది. ఈ క్షణికమైన భౌతికానందమును అనుభవించుకొలది కోరికలు పెరుగునే కానీ తరగవు. ఈ కోరికలు పెరిగి పెరిగి తనకు బంధమును కలిపించుకొని అది కేవలము ఒక ఊబిగా మారుతున్నది మానవునికి. ఇలాంటి భౌతికానందములనిమిత్తమై మానవుడు అనేక విధములైన త్యాగములకు పూనుకుంటున్నాడు. మానవుడనగా మనసుకు ఆవలనున్న ఆత్మ. ఈ సత్యాన్ని తాను గుర్తించుకున్నప్పుడు మనసుకు యివతల వున్నటువంటి దేహమును తాను యేమాత్రం విశ్వసించడు. మనసుకు యీవల వున్నటువంటిదే శరీరము. మనసుకు ఆవల వున్నటువంటిదే ఆత్మ. ఆత్మతత్త్వము నిత్యమైనటువంటిది, అమృతమైనటువంటిది.

**మానవత్వములోని దివ్యత్వమును గుర్తించి వర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యము**

**చావుపుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆదిమధ్యాంత రహితుడనాదివాడు**
**తాను చావక పుట్టక చంపబడక**
**అన్నిటను ఆత్మరూపుడై అలరుచుండు**

ఇట్టి నిత్య సత్యమైన అమృతతత్వమును ఆనందింపచేసేటువంటిదే ఆత్మతత్త్వము. ఇంక

srisathyasaivachanamrutam

దేహము.

**మలినపుకొంప రోగముల ముగ్గెడు సేవకగంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బుల పొదిలెమ్ము చూడ మన మెచ్చుదలంపగ దేహమింక...**

ఇట్టి అనిత్యము, అశాశ్వతము, అసత్యము అయినటువంటి, నీటిబుడగవంటి దేహమును మనము విశ్వసించి నిత్య సత్య నిర్మలమైనటువంటి ఆత్మతత్త్వాన్ని విస్మరిస్తున్నాము. ఈ కారణంచేతనే మనము పొందవలసినటువంటి ఆనందమునకు, ఆత్మానందమునకు అతి దూరమైపోతున్నాము. మేఘములచే కప్పబడిన సూర్యునివలె, నివురుగప్పిన నిప్పువలె, పొరగప్పిన కంటిదృష్టివలె, పాచికప్పిన నీరువలె, రాగద్వేషములతో కప్పబడినటువంటి యీ చిత్తమునకు ఆత్మానందము యేరీతిగా లభ్యమవుతుంది? మేఘములు కదలిన తరువాతనే సూర్యుని చూడవచ్చును. నివురు తొలగిన తక్షణమే మనము నిప్పును చూడవచ్చును. రాగద్వేషములు దూరము గావించుకున్నప్పుడే యీ ఆత్మానందమును అనుభవించవచ్చును. కనుక మానవత్వములో నున్నటువంటి దివ్యత్వాన్ని గుర్తించి వర్తించటమే ప్రధానమైన కర్తవ్యము.

**అహంకారముండినంతవరకు ఆత్మానందము లభించదు**

మానవుడనగా కేవలము యీ పాంచభౌతికమైన దేహమును ధరించినటువంటివాడు కాదు. ఆత్మానందమనేది నిధి నిక్షేపము. లోకములో నిధి నిక్షేపములు అనేక విధములుగా భద్రముగావించి కాపాడుతూవుంటారు. దీనికి అన్ని విధములైన కాపలాలు పెడతారు. అదే విధముగనే మానవుని జీవితముయొక్క కర్తవ్యమైనటువంటి ఆనందము అనే నిధి నిక్షేపములను యీ అహంకారమనేటువంటి తత్త్వము కాపాడుతూ వుంటుంది. ఏనాడు యీ అహంకారమనేటువంటి సర్పమును నిర్మూలము గావింతుమో ఆనాడు మనకు యీ ఆనందము లభ్యమవుతుంది. అహంకారమువుండినంతవరకు మనము ఆత్మానందమునకు అతిదూరముగానే వుంటున్నాము. కనుక, మానవుడు రాగద్వేషములకు దూరమై, అహంకారమును నిర్మూలంచేసి, నిస్వార్థమైనటువంటి కర్తవ్యకర్మలనాచరించటం



sri sathyasai vachanamrutam

ప్రధానమైన లక్ష్యము. నిజముగా మానవుడు ఆనందస్వరూపుడు. తాను ఆశించునది ఆనందమే! సౌఖ్యముతో కూడినటువంటి నిధి, యీ మానవత్వము. సౌఖ్యాంబుధి అనగా ఆనందసాగరము. తనలోపల, వెలుపల; చుట్టు, పైన, క్రింద వున్నదంతా ఆనందమే! ఆనందములో ఓలలాడుతున్న మానవుడు ఆనందము నిమిత్తమై అఱ్ఱులు చాస్తున్నాడంటే యిది కేవలము అజ్ఞానం కాదా? ఆనందము తనయందే వున్నది. తానే అనంత స్వరూపుడు, ఆనందమయుడు అయినప్పటికి యీ క్షుద్రమైన దేహము తానని భ్రమించటంచేతనే తాను ఆనందాన్ని కోల్పోతున్నాడు.

## దైవాంశమైన మానవుడు దైవమును విడిచి ఉండలేడు

జీవితగమ్యము దైవాన్ని చేరటమే కానీ, చావటంకాదు! సముద్రానికి నది అంశము. ఈ నది సముద్రములో చేరినప్పుడే దానికి ఆనందము. ఈ నదికి అంశము చేప. జలాన్ని వదలి ఒక్క క్షణమైనా జీవించలేదు. తల్లికి అంశము బిడ్డ. తల్లిని వదలి బిడ్డ జీవించకలదా? చెట్టుకు అంశము కొమ్మ. చెట్టును విడచి కొమ్మ బ్రతుకలేదు. అదే విధముగా దైవాంశమైన మానవుడు దైవమును విడచి వుండలేడు. కనుక దైవమును చేరే నిమిత్తమై మానవత్వము ప్రాప్తించిందన్న సత్యాన్ని గుర్తించటం అత్యవసరము. దైవాంశమే అందరిలోను వున్నదని భగవద్గీత బోధిస్తున్నది. "అహమాత్మ గుడాకేశ", నేను సర్వజీవులయందు ఆత్మస్వరూపుడనై వున్నాను అని బోధించాడు, కృష్ణుడు.

పశువువలె ప్రకృతికి బానిసయై జీవించటానికి కాదు, మానవుడు జన్మించినది. ప్రకృతికి ప్రభువై జీవించాలి. నరుడు నారాయణత్వాన్ని అనుభవించాలి. ప్రతి మానవుడు "శివోహమ్, అచ్యుతానందోహమ్, ఆనందోహమ్" అనే అనుభూతిని పొందాలి. కాలసర్పము కాటు వేయకమునుపే, జీవితనౌక మునిగిపోకముందే, యీ సత్యాన్ని గుర్తించి ఆత్మానందాన్ని అనుభవించటానికి ప్రయత్నించాలి.

## స్వస్వరూప సందర్శనమే మోక్షము

మోక్షము అనేటువంటిది ఒక ప్రత్యేకమైన స్థానముకాదు. తన స్వరూపమును తాను గుర్తించుకోటమే మోక్షము! తన స్వరూపాన్ని తాను సందర్శించటమే మోక్షము! తనను



sri sathyasai vachanamrutam

తాను గుర్తించుకోటమే మోక్షము! ఇలాంటి సత్యానికి మనము అతిదూరమై అసత్యానికి సమీపులమై అశాంతిని అనుభవించటానికి పూనుకుంటున్నాము. సర్వత్ర వుంటున్నటువంటిది ఆనందమే! మనము నివసించుచున్నది ఆనందమే! మన జీవితమే ఆనందము! కానీ అభిమానమమకారములచేత కప్పబడి యీ ఆవరణముచేతనే మనము అశాంతిని అనుభవిస్తున్నాము. ఏనాడు యీ ఆవరించుకున్నటువంటి ఆవరణను తొలగించుకుంటామో ఆనాడే సత్యస్వరూపాన్ని గుర్తించటానికి వీలవుతుంది.

రాత్రి మనము గాఢనిద్ర ననుభవించాము. ఈ గాఢనిద్రలో ఆనందాన్ని అనుభవించాము. ఈ ఆనందము యెక్కడనుంచి వచ్చినది? నిద్రలో యే వస్తువును మనము అనుభవించలేదు. ఏ వస్తువును మనము అందుకోలేదు, చూడలేదు. కానీ, యీ ఆనందము యెక్కడినుండి వచ్చినది? ఇది బయటినుండి ప్రవేశించినది కాదు. తమయందున్న ఆనందమునే అన్ని విధములైన ఆవరణాన్ని త్యజించటంచేత అనుభవించగలిగాము.

**జడచైతన్యములు రెండింటిని వేరుగావించటమే మానవుని ప్రధాన కర్తవ్యము**

ఉన్నది రెండు తత్త్వములు–ఒకటి దృక్కు, రెండవది దృశ్యము. ఈ దృక్కు సాక్షీభూతమైన ఆత్మతత్త్వము. దృశ్యము రూపనామములతోకూడిన యీ ప్రకృతి తత్త్వము. దృక్కు చైతన్యము, దృశ్యము జడము. ఈ జడచైతన్యములు రెండింటిని వేరు గావించటమే మానవునియొక్క ప్రధాన కర్తవ్యము. ఈ రెండింటిని విభజించేటువంటి దీనియందే మానవుని తెలివితేటలను వినియోగించాలి. ఈ విభాగయోగాన్ని అనుభవించినవాడే సరియైన సాధకుడు. ఈ రెండింటిని చేర్చటంచేతనే మానవుడు దుఃఖమునకు గురియైపోతున్నాడు. కానీ యీ సత్యాన్ని గుర్తించుకొనలేక మానవుడు అనేక విధములైన అశాంతికి గురి అవుతున్నాడు. కనుక దృక్కు, దృశ్యముల భేదాన్ని గుర్తించి వేరుపరచటమే ముఖ్యమైన పని. ఎంతకాలము యీ లౌకికమైన భోగ, భాగ్యములనుభవించినప్పటికి యిందులో శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన ఆనందాన్ని మనము అనుభవించలేము. అనుభవించుకొలది యివి మనలను మరింత బంధనలోనికి చేర్చుచున్నవేగానీ

srisathyasaivachanamrutam

సుఖశాంతులకేమాత్రముకూడ నోచుకోలేదు. అనుభవించేకొలది యీ యింద్రియములు మరింత బలహీనతను పోందుతాయేకాని బలమును యివి పొందటంలేదు. ఒక చిన్న ఉదాహరణము. జాలరి ఒక కొలనుకు పోయి గాలం వేస్తుంటాడు. ఆ గాలమునకు కొసలోపల ఒక ముల్లు పెట్టి దానికి ఒక మాంసపు ముక్కనతికించి జలములో దానిని వేస్తాడు. కానీ విజ్ఞానములేని చేప యీనాడు తనకు గొప్ప ఆహారం లభించిందని యెంతో ఆశతో వచ్చి ఆ మాంసమును మ్రింగుతుంది. ఈ మాంసపుముక్క యెంత ఆనందాన్ని అందించిందో, మరుక్షణం అంతదుఃఖాన్ని అనుభవిస్తుంది. ఆ మాంసపుముక్కను తినటంచేత ఆ గాలమును తాను అందుకొని ప్రాణం విడుస్తుంది. అదే విధముగనే క్షణభంగురమైన యీ యింద్రియసుఖములకు లోబడి యెంతో ఆశగా అనుభవించి తదుపరి యెంతో దుఃఖమును మనము అనుభవిస్తున్నాము. ఇందులో శాశ్వతమైన ఆనందము కానీ, సుఖముగానీ యేనాడు లేదు. 'అనిత్యం అసుఖంలోకమ్'. కనుకనే బుద్ధుడు 'సర్వమ్ దుఃఖమ్ దుఃఖమ్, సర్వమ్ క్షణికం క్షణికం' అన్నాడు. ఇలాంటి సత్యాన్ని గుర్తించినవారు ఆనాటి మహరాజులు. సర్వసౌఖ్యములుండినప్పటికి, సర్వ సదుపాయములనుభవించినప్పటికి, సర్వసంగపరిత్యాగులై పరమాత్ముని ఆనందాన్ని అనుభవించే నిమిత్తమై అడవులకు ప్రయాణమై వెళ్లారు. త్యాగమే నిజమైన యోగమని వారు విశ్వసిస్తూ వచ్చారు. సర్వము భగవంతునియొక్క స్వరూపమనే తత్త్వాన్ని మనము గుర్తించినప్పుడు యిట్టి ఆనందమును మనము అనుభవించవచ్చును.

**బ్రహ్మాండమంతా ఆత్మతత్త్వములో ఇమిడియుంటుంది**

మానవుడు మూడు రకములైనటువంటి తత్త్వములను అనుభవించాలి. మూడురకములైన ఆకాశములుంటున్నాయి. మొదటిది భూతాకాశము. రెండవది చిత్తాకాశము. మూడవది చిదాకాశము. భూతాకాశమనగా మనకంటికి కనుపించే యీ భూమండలమంతా, ఆడవులు, చెట్లు, కొండలు, నదులు యివన్నీ. ఈ భూమండలముయొక్క నిడివి 8000 మైళ్లు వుంటుంది. దీనికంటే పెద్దది సూర్యమండలము. అది 8 లక్షలమైళ్లు నిడివిగా వుంటుంది. దీనికంటే యింకా గొప్పది నక్షత్రాలంతా వుంటున్నాయి. ఈ నక్షత్రాలు అమితమైన దూరములో వుంటున్నాయి. ఈ



sri sathyasaivahini.org

నక్షత్రముల నిడివి యింత అంత అని చెప్పుటకు వీలుకాదు. కనుకనే నక్షత్రములయొక్క కాంతి ఒక్క క్షణములో అనగా కనురెప్పపాటులో 180, 160 వేల మైళ్ల దూరం పోతుంది. ఇంత ప్రయాణం చేసే యీ వెలుతురు యింకా కొన్ని నక్షత్రముల వెలుతురు యీనాటికికూడను భూమికి చేరలేకుండా వుంది. యీ నక్షత్రములు, సూర్యుడు, చంద్రుడు, భూమి అన్నీ చేరినటువంటిదే యీ భూతాకాశము. ఇంత భూతాకాశము చిత్తాకాశములో యిమిడివుంటున్నది. ఈ చిత్తాకాశమనగా యేమిటి? మనము సందర్శించిన దృశ్యములన్నీ మన చిత్తములో అణుమాత్రముగా నిలచిపోతుంటాయి. ఈ భూతాకాశమంతా యీ చిత్తాకాశములో చిన్న రూపంగా నిలచిపోతుంది. అదే మానసిక తత్త్వము. యీ మనస్తత్వం చిదాకాశములో మరింత దీనిగా యిమిడిపోతుంది. ఈ చిదాకాశమే ఆత్మస్వరూపము. ఈ ఆత్మయందే భూతాకాశము, చిత్తాకాశము యిమిడి వుంటాయి. అనగా బ్రహ్మాండమంతా యీ ఆత్మతత్త్వములో యిమిడి వుండటంచేత ఆత్మయే సర్వస్వము అని మనము గురించటానికి వీలవుతుంది.

**మన దృష్టి బహిర్ముఖముగా తిరుగుతున్నంతకాలము మనకు ఆత్మానందము లభ్యము కాదు**

ఇట్టి ఆత్మానందమును అనుభవించటమే మన ప్రధానమైనటువంటి కర్తవ్యము. మనము వస్తుతః ఆనందమయులమై ఆనందాన్ని అనేక విధముల బయటి ప్రపంచములో వెదకటానికి ప్రయత్నిస్తున్నాము. మన దృష్టిని అంతర్ముఖము గావించుకోవాలి. మన దృష్టి బహిర్ముఖముగా తిరుగుతున్నంతకాలము మనకు యీ ఆత్మానందము లభ్యముకాదు. కస్తూరిమృగము యేదో కొంత వాసనను గమనించి అడవిఅంతా సంచరిస్తుందట, ఈ వాసన యెక్కడినుండి వస్తుందని. తిరిగి తిరిగి యీ కస్తూరిమృగము అలసిపోయింది. ఒక చల్లని వృక్షఛాయక్రిందకూర్చొని విశ్రాంతిని పొందాలనుకుంది. అలసిపోటంచేత తనముక్కును బొడ్డుదగ్గర పెట్టుకొని నిద్రించటానికి ప్రయత్నించింది. తక్షణమే అక్కడనుండి కస్తూరి వాసన ప్రారంభమైంది. క్రమక్రమేణా యీ వాసన తననుండే వస్తోందని గుర్తించింది. అప్పుడు యీ మృగము యింక యెక్కడా సంచరించకుండా ఒకే స్థానములో నిలచిపోయింది. అదే విధముగా మానవుడు యీనాడు ఆనందము బాహ్యప్రపంచమందున్నదని ప్రపంచములో సర్వత్ర సంచారం చేస్తున్నాడు. ఏ



sri sathyasai vahini

ఉద్యోగములో నాకు ఆనందము లభిస్తుందో అని ఉద్యోగాలకోసం ప్రాకులాడుతున్నాడు. ఏ వ్యాపారంలో నాకు ఆనందం లభిస్తుందో అని వ్యాపారంలో క్రుంగిపోతున్నాడు. ఏ వ్యవసాయంలో నాకానందం లభిస్తుందో అని వ్యవసాయములో రాత్రింబవళ్లు శ్రమపడిపోతున్నాడు. తన ఆనందము వ్యవసాయంలోలేదు, వ్యాపారంలోలేదు, ఉద్యోగములో లేదు, తన ఆనందం తనయందే వుంటున్నది. కనుక మానవుడు తన దృష్టిని బహిర్ముఖము గావించుకున్నంతవరకు ఆనందానికి దూరముగానే వుంటాడు. ఏనాడు తన దృష్టిని అంతర్ముఖము గావించుకుంటాడో ఆనాడే సత్యానందమును అనుభవిస్తాడు. అదే అమరానందము, అదే ఆత్మానందము, అదే అమృతానందము. ఇట్టి ఆనందము నిమిత్తమై మానవుడు చేయవలసిన ప్రయత్నములకు యేమాత్రము సమీపించటంలేదు. లోకసంబంధమైన ఆనందములు క్షణికములని తెలుసు. తెలిసికూడను తాను గుర్తించుకోటానికి ప్రయత్నించటంలేదు. తన తెలివితేటల్ని బహిర్ముఖముగా అభివృద్ధి గావించుకుంటున్నాడేగానీ అంతర్ముఖముగా అభివృద్ధి గావించుకోటంలేదు. కావలసినన్ని పరిశోధనలు సల్పుతున్నారు, వైజ్ఞానికులు. తమ శాస్త్రాలలో బహిర్ముఖమైన పరిశోధనలు సలిపి బహిర్ముఖసత్యాలనే గుర్తిస్తున్నారు. కానీ యీ పరిశోధనలవల్ల అంతర్ముఖ ఆనందము వారికి లభ్యముకాదు. ఎవరు ఆత్మానందాన్ని అనుభవించాలని కోరుతాడో అట్టి మానవుడు కొంతవరకు బహిర్ముఖదృష్టిని అణచుకోటానికి ప్రయత్నించాలి. ఒక్క దైవములోనే యిట్టి ఆత్మానందము మనకు ప్రాప్తిస్తుందే తప్ప వస్తు వాహనాలలోకాని, విషయములందుకాని, వ్యక్తులయందుకానీ మనకు ఆనందము లభించదు.

**అనేకత్వమును ఏకత్వముగా భావించాలి**

అట్టి ఆనందము నిమిత్తమై ఆనాటి గోపికలందరు అనేక విధములైన పరితాపములు అనుభవిస్తూ వచ్చారు. ' ఓ దైవమా! నిన్ను వదలి ఒక్క క్షణమైనా మేము వుండలేము. నీ తత్వమే మా తత్వముగా మారిపోవాలి. మా తత్వమే నీ తత్వముగా మారిపోవాలి. సత్యమే తత్వంకావాలి. తత్వమే సత్యంకావాలి. ఈ విధమైనటువంటి ప్రజ్ఞానదృష్టితో వారు పరిశీలన చేస్తూ వచ్చారు. అట్టి ప్రజ్ఞానమునే బ్రహ్మగా భావిస్తూవచ్చారు. 'ప్రజ్ఞానం బ్రహ్మ'



sri sathyasaivahini

అనే మహావాక్యములో వున్న సత్యాన్ని యీ విధముగా వారు గుర్తిస్తూ వచ్చారు. ఒక్క క్షణమైనా దైవాన్ని వదలి వుండేటువంటివారుకాదు. దైవం యే రూపము ధరించినాకూడా ఆ రూపానికి సమీపముగా జీవించాలని వారు ఆశించేవారు. 'సర్వతఃపాణిపాదం'. భగవంతుడు సర్వస్వరూపుడు. సర్వత్ర వుండేటువంటివాడు. ఇలాంటి పరమాత్ముని యెక్కడని వారు పరిశోధనలు చేయటం? ఎక్కడ అన్వేషణ జరపటం? అంతా భగవంతుని సంకల్పమే! 'ఏకోహం బహుస్యాం' అని తానే సంకల్పించుకున్నాడు. సర్వరూపములుకూడా తానే. వీటిని సంకల్పించుకునే అనేకత్వములో వున్నటువంటి యేకత్వమును గుర్తించమనే కర్మ, ఉపాసన, జ్ఞానమార్గములు అందిస్తూ వచ్చాడు. ఈ మార్గములద్వారా అనంతస్వరూపుడైన పరమాత్ముడు యేకస్వరూపుడే అనేటువంటి సత్యాన్ని గుర్తించాలి. 'ఏకప్రభుకో అనేకనామ్'. అంతేకాని, యేకత్వమును అనేకత్వముగా భావించరాదు. అనేకత్వాన్ని యేకత్వముగా భావించాలి.

**దుష్టభావములను విడిచిపెట్టడమే నిజమైన త్యాగము**

మానవుడు క్షణక్షణమునకు సందేహములలో మునిగిపోతున్నాడు. భేదములతో బాధలతో నిండివుంటున్నాడు. ఎక్కడ చూచినా భేదము. కులభేదము, మతభేదము, లింగభేదము, జాతిభేదము, వర్ణభేదము, అన్నీ భేదములే! యుద్ధభయము, అధికభయము, ఆస్తిభయము, సర్వమూ భయమే! అనావృష్టితో భయము, కరువుకాటకాలతో భయము. భయము, భేదము, యీ రెండూ మానవుని బంధిస్తున్నాయి. ఈ భయములు, భేదములు పోవాలనుకున్నప్పుడు త్యాగాన్ని మనము అవలంబించాలి. త్యాగముచేతనే భయము, భేదము నిర్మూలమవుతాయి. త్యాగమనగా యేమిటి? కేవలము యిల్లువాకిలి వదలిపెట్టటము, కుటుంబాలను వదలిపెట్టటము, అరణ్యాలకు పోవటము యిది కాదు, త్యాగము. మానవత్వములో వున్న భేదభావమును మనం దూరం చెయ్యాలి.

**భావమందు దుష్టభావము వీడుటే**
**త్యాగమగును అదియే యోగమగును**
**ఆస్తి ఆలివీడి అడవికేగుట కాదు**

srisathyasaivacharamrutam

ఇలాంటి దుష్టభావములను వదలటమే నిజమైన త్యాగము. 'సర్వకర్మభగవత్ ప్రీత్యర్థమ్' అనేటువంటి సత్యములో మనము ప్రవేశించాలి. ఈనాడు మానవజాతి లౌకికంగా, భౌతికంగా యెంతో అభివృద్ధి గాంచినది. కానీ నైతికంగా చూస్తే క్షుద్రవిమర్శలు, సంకుచితమైన భావములు మితిమీరిపోతున్నాయి. ఏదిచూసినా, యేదిచేసినా, యేది చెప్పినా, యేది అనుభవించినా, స్వార్థం, స్వార్థం, స్వార్థం. స్వార్థముచేతిలో కీలుబొమ్మై జీవిస్తున్నాడు, మానవుడు. ఈ స్వార్థము, స్వప్రయోజనము అనే సంకెళ్లను యేనాడు మనము త్యజించెదమో ఆనాడే మనకు ఆనందము ప్రాప్తిస్తుంది. ఈ స్వార్థమనేటువంటి దానిని మనము పరార్థముగా మార్చుకోవాలి. సర్వము భగవంతుని కర్మగా మనము విశ్వసించాలి. ఆనందమునందే జీవించుచున్నామనే భావము మనము అభివృద్ధి గావించుకోవాలి. దుఃఖము, దుఃఖము. దుఃఖమునకు రూపమేమిటి? మన భ్రాంతులయొక్క వికల్పమే! దుఃఖమునకు రూపములేదు. తాను వాంఛించినది లభించకుండాపోవటమే దుఃఖమునకు కారణము. ఈ వాంఛలకు కారణమేమిటి? ఈ వాంఛలంతా జగత్ స్వరూపమైనటువంటి భ్రాంతులే! భ్రాంతులకు అతీతమైనటువంటి స్థితిలో మనము ప్రవేశించాలి. భ్రాంతులు గుణములచే లభించినటువంటివి. గుణాతీతుడు భగవంతుడు. అట్టి స్థాయిని మనము చేరినప్పుడే యీ భ్రమలన్నీ బ్రహ్మమయముగా మారిపోతాయి.

### ప్రేమ ఎక్కడ వుండునో అక్కడ శ్రద్ధ ఉంటుంది

ఆనాటి గోపికలకు ఒక్క కృష్ణభ్రాంతి తప్ప అన్యభ్రాంతి లేదు. వారు యేచదువులు చదవలేదు. ఏ వేద, శాస్త్ర, యితిహాస, పురాణములు పఠించలేదు. ఏ యజ్ఞయాగాదిక్రతువులు ఆచరించలేదు. నిర్మలమైనటువంటి ప్రేమ, నిస్వార్థమైనటువంటి సేవ. ఆ ప్రేమ ఒక్కటే చాలు. అదే అనన్యప్రేమ. దీనినే పరమభక్తి, దానినే సాధ్యభక్తి అని చెప్పుకోవచ్చు. ప్రేమ యెక్కడవుండునో అక్కడ శ్రద్ధ వుంటుంది. ఎక్కడ శ్రద్ధవుండునో అక్కడ జ్ఞానమేర్పడుతుంది. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్'. ఎక్కడ జ్ఞానమో అక్కడ సాధన. ఎక్కడ సాధనో అక్కడే సాధ్యము. ఆ సాధ్యమే పరమభక్తి. ఆ

srisathyasaivachanamrutam

పరమభక్తే అనన్యభక్తి. ఇదే నిజమైనటువంటి త్యాగము. తన దేహభ్రాంతులుకానీ, మనో వాంఛలుకానీ యేకమైనటువంటి స్వరూపము కృష్ణుడే.

**నామంలో నామిని దర్శించాలి**

ఈనాడు మనకు కలియుగములో కావలసినటువంటిది నామము, దానము. నామము, దానము రెండే మనకు ప్రధానమైనటువంటివి. ఏ నామము? ఏ దానము? దానమంటే నామము పెట్టటం కాదు. దానమంటే అన్నదానము. నామమంటే భగవన్నామము. కారణంయేమిటి? అన్నంబ్రహ్మ. ఆ బ్రహ్మతత్వాన్ని యీ రూపములో మనము అనుభవించాలి. నామంలోనామిని మనం దర్శించాలి. ఇక్కడ జడ చైతన్యములు రెండు నామి, నామములుగా వుంటున్నాయి. ఇవే క్షేత్రజ్ఞ, క్షేత్రములుగా రూపొందుతున్నాయి. ఇవియే ఆత్మ, ఆనాత్మగా రూపొందుతున్నాయి. దీనినే దేహి, దేహములని పిలువడం జరుగుతున్నది. ఇవియే శరీరము, శరీరి అనికూడను పిలువబడుతున్నాయి. అనగా ఒకటి చైతన్యము, మరొకటి జడము. ఈ జడచైతన్యములను విభాగము గావించటమే మనయొక్క ప్రధాన సాధన లేక రెండింటిని యేకత్వము గావించటమే ప్రధానమైన సాధన. అందులో మనం యేకమైనప్పుడే యీ దివ్యత్వాన్ని మనము అనుభవిస్తాము.

**రామాయణములో రావణుడు కామముచేతనే తనకు తాను మరియు తన జాతిని నాశనం చేసుకున్నాడు**

ప్రేమస్వరూపులారా! ప్రేమచేతనే పరమాత్మను పొందుటకు ప్రయత్నించాలి. ఈ ప్రేమతప్ప అన్యమార్గములో మనము భగవంతుని యేమాత్రము పొందలేము. తపములు చేయవచ్చును. ఇది కేవలం ఒక విధమైన సత్కర్మగా భావించవచ్చు. ఇంక యజ్ఞయాగాదిక్రతువులంతా ఆచరించవచ్చు. తద్వారా చిత్తశుద్ధి కలుగవచ్చును. 'చిత్తస్యశుద్ధయే కర్మః'. ఈ కర్మలద్వారా చిత్తశుద్ధి కలుగవచ్చు. తద్వారా మనము స్వర్గాన్ని పొందవచ్చు. 'క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి'. ఆ పుణ్యఫలము నశించినంతనే తిరిగి మర్త్యలోకమునకు రావలసినదే! ఇవి కేవలం తాత్కాలిక సుఖాలను కోరే మనము



sri sathyasai vachanamrutam

ఆచరిస్తున్నాము. ప్రేమ ఒక్కటి మాత్రమే డైరెక్టుగా భగవంతుని చేరుస్తుంది. సర్వులనూ మనము ప్రేమగా చూడాలి. సర్వులయందు వున్న ప్రేమస్వరూపాన్ని మనము దర్శించాలి. ప్రేమలేని మానవుడు జగత్తులో కానరాడు. ప్రేమకు యెన్ని రూపములో, యెన్ని నామములో పెట్టవచ్చు. కానీ ప్రేమ ఒక్కటే! ఇట్టి ప్రేమను పొందటానికి మూడు మాత్రం ఆటంకములు వస్తున్నాయి. ఆ శతృవులెవరు? కామ, క్రోధ, లోభములు. ఈ కామ, క్రోధ లోభములు పరమశతృవులుగా రూపొంది సాధకుని అన్ని విధములా బంధిస్తున్నాయి. ఈ మూడింటి సంహారనిమిత్తమై రామాయణ, భారత, భాగవతములు యీ మూడు తయారైనవి. రామాయణములో రావణుడు కామముగా రూపొందుతూ వచ్చాడు. ఈ కామముచేతనే తనకు తాను, తనయొక్క వంశమును నాశనము చేసుకున్నాడు. తనజాతిని భగ్నం చేసుకున్నాడు. ఇది రామాయణములో మనము గుర్తించవలసినటువంటి ప్రధానమైన అంశము.

**భాగవతములో హిరణ్యకశిపుడు క్రోధముచేత నశించాడు**

భాగవతంలో హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు కేవలం ద్వేషముతో జీవిస్తూ వచ్చారు. హిరణ్యకశిపుడు హరిద్వేషి. ఈ క్రోధము మండిపోయేటువంటిది. కానీ హిరణ్యకశిపుడు యెలాంటివాడు? ఆనాటి వైజ్ఞానికులలోపల మితిమీరిన శక్తి కలిగినటువంటివాడు. సర్వత్రపరిశోధనలు గావించాడు. పంచభూతములను హస్తమునందు వశము చేసుకున్నాడు. భగవంతుడు యెక్కడ యెక్కడ అని సముద్రమంతా గాలించాడు. చేపవలే జలములో సంచరించాడు. పక్షివలె ఆకాశములో యెగురుతూ వెళ్లాడు. ఎన్ని శక్తులు సంపాదించి ప్రయోజనమేమిటి? ఇవన్నీ భౌతిక శక్తులే! దైవాన్ని మరచిన తరువాత యెన్ని వుండి యేమి ప్రయోజనము? Hero becomes zero if he forgets God. దైవాన్ని మరచినటువంటి శక్తులు యెన్ని సంపాదించి ప్రయోజనమేమిటి? దైవాన్ని మరచటంచేతనే క్రోధము మితిమీరి పోయింది. ఈ క్రోధము కలిగినటువంటివానికి అన్నీ కష్టములు, నష్టములే! నిందలే! నిష్ఠూరములే! సమాజములో మంచిపేరు యేమాత్రము పొందలేరు. కన్నకొడుకుగానీ, కట్టుకొన్న భార్యగానీ వారికికూడా తాను విరోధిగానే మారుతాడు.

srisathyasaivahini.org

**కోపము కలిగినవానికి**
**ఏ పనియు ఫలింపకుండు యెగ్గులుకల్గున్**
**పాపపు పనులను చేయుచు**
**ఛీ పొమ్మనిపించుకొనుట చేకూరునుసుమీ.**
**తనకలిమి భంగపుచ్చును**
**తనకున్ గల గౌరవంబు దగ్ధము చేయున్**
**తనవారలకెడచేయును**
**జనులకు కోపంబు వలన సర్వము చెడున్**

కనుకనే హిరణ్యకశిపుడు కట్టకడపటికి తన కన్నకుమారుడనేటువంటి ప్రేమకూడా లేకుండా కుమారుని నానా అవస్థలు పెట్టాడు. భాగవతములోపల క్రోధమునకు హిరణ్యకశిపుడు ప్రతీక.

**లోభత్వముచేత దుర్యోధనుడు తన జీవితమును, వంశమునుకూడా నాశనం చేసుకున్నాడు**

భారతములో మహాలోభి దుర్యోధనుడు. పాండవులు ధర్మమూర్తులైనప్పటికి సూదిమొనమోపే స్థలంకూడా యివ్వనని భీష్మించుకుని పరమలోభిగా మారిపోయాడు. తనది కానిదానిని తాను అనుభవించాలని ప్రయత్నించాడు. తనది కానటువంటిదానిని ఆశించి, అనుభవించటానికి ప్రయత్నించేవాడు దొంగ అన్నారు. దొంగని ప్రభుత్వముగానీ, శాస్త్రముగానీ నిషేధించింది. కారణమేమిటి? తనది కానటువంటిదానిని తాను ఆశిస్తున్నాడు. తనది కానటువంటిదానిని పొందాలని ప్రయత్నిస్తున్నాడు. కనుకనే దుర్యోధనుడు అన్ని విధములా పరాభవము పొందాడు. ఏకించిత్‌కూడా యితరులకు యిచ్చి పుచ్చుకునేటువంటి విశాలభావము కోల్పోయాడు. ఇలాంటి లోభత్వముచేతనే దుర్యోధనుడు తన జీవితాన్ని, తన వంశాన్ని నాశనము చేసుకున్నాడు.

**సర్వదుర్గుణములు ఒక్క సర్వేశ్వరనామముతోనే పరిహారము గావించుకోవచ్చు**

రామాయణములో కామము, భాగవతములో క్రోధము, భారతములో లోభము యీ మూడింటిని యీ మూడు పురాణములు చక్కగా ప్రబోధిస్తూ వచ్చాయి. ఈనాడు

sri sathyasai vachanamrutam

కలియుగములోపల యీ మూడుకూడను కలిగినటువంటివానిగా తయారవుతున్నాడు, మానవుడు. రామాయణములోని కామము వీనియందు యిమిడి వుంటున్నది. భాగవతమునందు క్రోధము వీనియందు యిమిడివుంటున్నది. భారతములోని లోభత్వము నిండివుంటున్నది. ఏదో ఒక్క గుణము వుండటంచేతనే ఆ వ్యక్తులంతా హతమారిపోగా, యీనాడు మానవునియందు మూడుగుణములు నిండివుండటంచేత యింకా హీనస్థితికి దిగజారిపోతాడు. ఈ సర్వ దుర్గుణములు ఒక్క సర్వేశ్వరనామముతోనే మనము పరిహారముగావించుకోవచ్చు.

ఈనాడు శివరాత్రి. శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. రాత్రి అనగా చీకటితో కూడినటువంటిది. కానీ యీనాడు శివరాత్రి. మంగళకరమైనటువంటి చీకటితో కూడినటువంటిది. 'చంద్రమా మనసో జాతః. చక్షో సూర్యోఅజాయతః', అని చెప్పబడింది. మనసుకు, చంద్రునికి సన్నిహిత సంబంధముంటున్నది. ఈనాడు చతుర్దశి. చంద్రునికి పదహారుకళలు. మానవుని మనసుకుకూడను పదహారుకళలు. ఈనాడు పదహైదుకళలను పూర్తిగా దాటి ఒక్క కళయందుమాత్రమే వుంటున్నాడు. మనకు అతి సమీపములో వుంటున్నాడు, మన సన్నిధిని చేరటానికి. దైవత్వానికి అతి సమీపములో వుండినటువంటి మానవత్వము చిత్తశుద్ధితో భగవంతుని నామస్మరణ చేస్తే అతి శీఘ్రముగా మనము ధన్యులవుతాము. ఈనాడు యే యితర చింతలకు అవకాశము యివ్వక దైవచింతనయందే కాలము సద్వినియోగము చేసుకోటం అత్యవసరము. అమూల్యమైనకాలమును అరక్షణముకూడను మనము వృథా చేయరాదు. కాలము క్షణక్షణమునకు కరగిపోతున్నది, ఐసుగడ్డవలె. ఓటుపడినకుండలలోపల నీరు కారిపోయినట్లు మన ఆయుఃప్రమాణము తరిగిపోతున్నది. ఇలాంటి పరిస్థితిలో మనము యింకా యేదో యెప్పుడో చేస్తామని కాలము వ్యర్థముచేయటానికి ప్రయత్నించరాదు. ఇలాంటి సదవకాశము మనము అనుభవించుతూ నిరంతరము ఆనందముతో మనము ప్రయత్నపూర్వకముగా సాధించాలి.

**(తేదీ 26-2-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam